సాక్షి నల్లగొండ

ఆదివారం । 16 । మార్చి । 2025



కోదాడలో పశు ఔషధ బ్యాంకు

పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య ఆలోచనతో కోదాడలో పశు ఔషధ బ్యాంకు ఏర్పాటైంది.

- 8లో



అటకెక్కిన 'ఫ్లోరైడ్' కేంద్రం

చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం పరిధిలో ఫ్లోరైడ్ పరిశోధనా కేంద్రం ఏర్పాటు ప్రతిపాదన అటకెక్కింది

- 10లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-32 (ఆదివారం సా॥)

సహర్ 5-01 (సోమవారం ఉ॥)

న్యూస్‌రీల్

నేడు మంత్రి కోమటిరెడ్డి పర్యటన

నల్లగొండ : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం నల్లగొండ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం కనగల్, తిప్పర్తి, మామి డాలలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం 10 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకొని సాగు నీటి పారుదల, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షిస్తారు. తర్వాత శ్రీనగర్‌కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలను కలుస్తారు.

నేడు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం

నల్లగొండ : అసెంబ్లీలో స్పీకర్‌పై ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయాలని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

30న కవి సమ్మేళనం

రామగిరి(నల్లగొండ) : ఉగాది పండుగ సందర్భంగా సాహితీ మేఖల ఆధ్వర్యంలో ఈ నెల 30న నల్లగొండ జిల్లా కేంద్రంలో కవి సమ్మేళనం, పురస్కారాలు ప్రధానోత్సవం చేయనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి పున్నమి అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రంగాచార్యు (సాహిత్యరంగం), సిరికొండ శివ సుబ్రహ్మణ్యం (పద్య కవిత్వం), శిరంశెట్టి కాంతారావు (కథ/నవల), ప్రొఫెసర్ రుద్రసాయి (శతాధిక పుస్తక రచయిత), చరణ్ అర్జున్ (మ్యూజిక్ డైరెక్టర్), కాసాల నర్సిరెడ్డి (సింగర్), సత్యనారాయణ (ఆధ్యాత్మిక సేవా రంగం), ఎల్వీ కుమార్ (సేవా రంగం)ను ఉగాది పురస్కారాలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు దాశరథి కృష్ణమాచార్య, ఉగాది ప్రాముఖ్యత గురించి కవితలు రాయాలని కోరారు. దేవులపల్లి నాగరాజు శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని కవులు, రచయితలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాని కోరారు.

18న కట్టంగూర్ పశువుల సంతవేలం

కట్టంగూర్ : 2025–26 సంవత్సరానికి గాను కట్టంగూర్ పశువుల సంతను ఈనెల 18న వేలం పాట వేయనున్నట్లు ఎంపీడీఓ (స్పెషల్ ఆఫీసర్) జ్ఞానప్రకాశ్‌రావు, పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న సాయంత్రం 5 గంటలలోపు పశువుల సంతకు రూ.2 లక్షలు, లైబజార్‌కు రూ.లక్ష చొప్పున డీడీ తీసి పంచాయతీ కార్యాలయంలో అందించాలని సూచించారు. తహసీల్దార్ ధ్రువీకరించిన రూ.5 లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్‌ను తీసుకు రావాలని పేర్కొన్నారు.

మూగజీవాలకు సరైన వైద్యం అందించాలి

నకిరేకల్ : మూగ జీవాల వైద్యం విషయంలో అప్రమతంగా ఉండాలని, వాటికి సరైన సమయంలో నట్టల నివారణ మందు, వ్యాక్సిన్లు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి జీవీ.రమేష్ సూచించారు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో శనివారం పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశువులు, గొర్రెలకు నట్టల నివారణ, క్యాల్షియం మినరల్స్ మందులను పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు తాత్కలికంగా వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమిస్తామని హమీ ఇచ్చారు. కార్యక్రమంలో మంగళపల్లి, నోముల పశు డాక్టర్లు రవికుమార్, రాంరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సైదమ్మ, మాజీ ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీవెంకన్న, గోపాల మిత్రలు విజయ్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాలి

రామగిరి(నల్లగొండ) : ఏదైనా వస్తువు కొని నష్టపోయినప్పుడు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాలని జిల్లా లీగల్ సెల్ సెక్రటరీ, జడ్జి బి.దీప్తి సూచించారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం – 2019 ప్రకారం వినియోగదారులు కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే నష్టపరిహారం లభిస్తుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల ఇన్‌చార్జి అధికారి హరీష్, ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి, తూనికలు కొలతల అధికారి రామకృష్ణ, ఎస్.రాజశేఖర్, సీహెచ్.గురవయ్య, హిమగిరి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ఏఐతో బోధనను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి


ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ : డీఈఓ

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈఓ బొల్లారం భిక్షపతి ఆదేశించారు. శనివారం అనుముల మండలంలోని కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏఐ-ఏ ఎక్స్‌ఎల్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఎంపిక చేసిన 14 ప్రాథమిక పాఠశాలలో చదువులో వెనుకబడిన 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీతో కూడిన కృత్రిమ మేధను ఉపయోగిస్తూ విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఈ విధానం ద్వారా విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు పెరిగి భాష, గణితశాస్త్రంపై కొంతమేర పట్టు సాధించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారులు కె.రవీందర్, హెచ్‌ఎంలు దాసా వెంకన్న, విజె.నిర్మల, పాయింట్ టీచర్ ఓరువాల సరిత తదితరులు ఉన్నారు.

డీసీసీ పదవికి డిమాండ్!

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పీఠంపై నేతల నజర్

- శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో మరొకరికి ఛాన్స్
- రేసులో పలువురు సీనియర్ నేతలు
- కార్పొరేషన్ పదవి ఇవ్వలేనివారికి డీసీసీతో సరిపెట్టే వ్యూహంలో పీసీసీ
- సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోనూ సమీకరణలపై దృష్టి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవులపై పీసీసీ కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ సమావేశాల తరువాత డీసీసీ అధ్యక్షుల మార్పులతోపాటు, పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేసే అవకాశం ఉంది. కార్పొరేషన్ పదవులను ఇవ్వలేని వారికి జిల్లా పార్టీ అధ్యక్ష పదవులను ఇచ్చి సరిపెట్టాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు తెలిసింది. సాధారణంగా రెండు మూడేళ్లకోసారి డీసీసీ కార్యవర్గం మార్పు చేయాల్సి ఉన్నప్పటికీ సామాజిక సమీకరణాలు కుదరక కొంత జాప్యం జరిగింది. ప్రస్తుతం నల్లగొండ ఎస్టీ, సూర్యాపేట బీసీ, యాదాద్రి భువనగిరి జిల్లా జనరల్ కోటాలో డీసీసీ అధ్యక్షులు కొనసాగుతున్నారు. మధ్యలో సూర్యాపేట జిల్లాలో మార్పులు చేయాలని భావించినప్పటికీ పార్టీలో అంతర్గత విభేదాల వల్ల దాని జోలికి పోలేదు. వెంకన్నకు రైతు కమిషన్ సభ్యుడిగా ఇవ్వడం, తాజాగా నల్లగొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఎమ్మెల్సీగా ఎన్నికవడంతో ఆశావహుల దృష్టి డీసీసీ అధ్యక్ష పదవులపై పడింది.

పార్టీ అధికారంలోకి రావడంతో పోటీ

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో డీసీసీ పదవులకు పోటీ ఏర్పడింది. సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ పదవీ కాలం ముగియగానే పటేల్ రమేష్‌రెడ్డిని అధ్యక్షుడిని చేయాలని అనుకున్నారు. అయితే దామోదర్‌రెడ్డి వర్గానికి, రమేష్‌రెడ్డికి మధ్య అభిప్రాయభేదాలు తలెత్తడంతో వెంకన్ననే కొనసాగిస్తున్నారు. అలాగే యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో చేరడంతో అప్పుడు భువనగిరి ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచరుడు అండెం సంజీవరెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. నల్లగొండ జిల్లాలో మాత్రం శంకర్‌నాయక్ జిల్లా అధ్యక్షుడిగా బొంతు వెంకటయ్య వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. అయితే కొత్త డీసీసీ అధ్యక్ష నియామకాలు ఇప్పుడున్న సామాజిక సమీకరణాల ఆధారంగానే ఉంటాయా? ఏమైనా మార్పులు చేస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

డీసీసీ రేసులో వీరే..

నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో కొత్త అధ్యక్షుడి నియామకం తప్పనిసరైంది. డీసీసీ పదవులు భర్తీ చేయడంలోనూ సామాజిక సమీకరణాలకే ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. నల్లగొండ డీసీసీ పీఠాన్ని బీసీ లేదా ఎస్సీలకు, సూర్యాపేట స్థానాన్ని జనరల్, యాదాద్రి జిల్లా ఎస్సీ లేదా జనరల్ కోటాలో భర్తీ చేసే అవకాశం ఉండొచ్చన్న చర్చ సాగుతోంది. నల్లగొండ జిల్లా అధ్యక్ష పదవి జనరల్‌కు కేటాయిస్తే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రధాన అనుచరుడు గుమ్మల మోహన్‌రెడ్డికి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అయితే ఆయనకు డీసీసీ పదవిపై పెద్దగా ఆలోచన లేదని, ఏదైనా కార్పొరేషన్ పదవి కోరుతున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. ఒకవేళ ఎస్సీకి కేటాయిస్తే.. మాజీ మంత్రి జానారెడ్డి ప్రధాన అనుచరుడు కొండేటి మల్లయ్యతో పాటు మరికొందరు డీసీసీ అధ్యక్ష పదవి ఆశిస్తున్నట్లు తెలిసింది. సూర్యాపేట డీసీసీ అధ్యక్ష పదవి ఈసారి కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల నేతలకు ఇస్తారని చెబుతున్నారు. ఎస్సీలకు ఇవ్వాలనుకుంటే తుంగతుర్తి మాజీ జెడ్పీటీసీ గుడిపాటి నర్సయ్య, బీసీకి ఇవ్వాలనుకుంటే మాత్రం ముశం రవికుమార్ తోపాటు పలువురు నేతల పేర్లు వినిపిస్తున్నాయి. యాదాద్రి జిల్లాలో ప్రస్తుత అధ్యక్షుడు సంజీవరెడ్డికి ఏదైనా నామినేటెడ్ పదవి ఇస్తేనే డీసీసీ అధ్యక్షున్ని మార్చే అవకాశం ఉంటుందని, లేదంటే ఆయన్నే కొనసాగిస్తారన్న అంటున్నారు.

• బీఆర్‌ఎస్ నిరసన



మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ బడ్జెట్ సెషన్ నుంచి సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం నకిరేకల్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు - నకిరేకల్

ఎన్నికల సంఘానికి పార్టీలు సహకరించాలి

నల్లగొండ : పారదర్శక, స్వచ్ఛమైన ఫొటో ఓటరు జాబితా తయారీలో భాగంగా చేపట్టే మార్పులు, చేర్పుల విషయంలో రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘానికి సహకరించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ కోరారు. శనివారం ఆయా పార్టీల నేతలో తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఈనెల 21వ తేదీలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో నాయకులు అశోక్, పిచ్చయ్య, లింగస్వామి, నర్సిరెడ్డి, రజీవుద్దీన్, హన్సి, ఆర్డీఓ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

డ్రైవింగ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : మోటార్ డ్రైవింగ్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నజీం అలీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ హకీంపేటలో హెవీ మోటార్, లైట్ మోటార్ డ్రైవింగ్ నేర్పుతారని.. 38 రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తారని.. శిక్షణ తర్వాత అర్హత ఉన్నవారికి ఉచితంగా పర్మినెంట్ లైసెన్స్ ఇస్తారని తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

312 మంది గైర్హాజరు

నల్లగొండ : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 312 మంది గైర్హాజరయ్యారు. శనివారం జరిగిన సెకండియర్ మ్యాథ్స్–బి, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 11,888 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 11,576 మంది హాజరయ్యారు. 312 మంది పరీక్షలకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

పోలీస్ శాఖకు సంపూర్ణ సహకారం



మంత్రి కోమటిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ చేతుల మీదుగా కబడ్డీలో ప్రథమ బహుమతి అందుకుంటున్న నల్లగొండ ఏఆర్ జట్టు

- క్రీడాపోటీలు పోలీసులకు ఉపయోగం
- డీఎస్పీ కార్యాలయం, పోలీసులకు క్వార్టర్ల నిర్మాణానికి కృషి
- పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపులో మంత్రి కోమటిరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి





మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : పోలీస్ శాఖకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమం శనివారం రాత్రి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కోమటిరెడ్డి విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. పోలీస్ శాఖ అంటే నిత్యం ఒత్తిడితో కూడిన ఉద్యోగమని ఒత్తిడిని జయించేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడాయన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత డ్రగ్స్ బారిన పడి తమ జీవితాన్ని, భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోందని.. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మౌలిక వసతులతోపాటు డీఎస్పీ నూతన కార్యాలయం, క్వార్టర్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా సీనియర్ సిటిజన్స్ కోసం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డే నిర్వహించడం అభినందనీయమన్నారు. గతంలో నల్లగొండలో మత ఘర్షణలు జరిగేవని.. ఇప్పుడు అలాంటివి ఎక్కడా లేవని ప్రశాంతంగా ఉందని చెప్పారు. ప్రస్తుతం రంజాన్ మాసం జరుగుతోందని.. అందరూ సోదరభావంతో మెలిగి నల్లగొండను రోల్ మోడల్‌గా తయారు చేయాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ క్రీడల్లో వచ్చే అనుభవాలు నిత్యం ఉద్యోగ నిర్వహణలో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ మూడు రోజులు పాటు నిర్వహించిన క్రీడల్లో సుమారు 800 మంది ఉద్యోగులు పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు రమేష్, కొలను శివరాంరెడ్డి, రాజశేఖర్‌రాజు, సీఐలు, ఎస్‌ఐలు తదితరులు ఉన్నారు.



టగ్ ఆఫ్ వార్ పోటీలో తలపడుతున్న పోలీస్ క్రీడాకారులు

గోదాం వద్ద పటిష్ట భద్రత ఉండాలి

నల్లగొండ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాం వద్ద భద్రతను నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ప్రతినెల ఈవీఎం గోదాం తనిఖీలో భాగంగా శనివారం ఆమె రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదామును తనిఖీ చేశారు. వారి సమక్షంలోనే ఈవీఎం గోదాం సీల్ తీసి లోపల భద్రపరిచిన ఈవీఎంలను తనిఖీ చేశారు. ఆమె వెంట వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ వై.అశోక్‌రెడ్డి ఉన్నారు.



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్



ఇందిరమ్మ ఇంటి నమూనాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఇందిరమ్మ ఇంటి నమూనా ఆవిష్కరణ

నల్లగొండ : ఇందిరమ్మ ఇళ్లపై లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇంటి నమూనాను కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లపై పూర్తిగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత గృహ నిర్మాణ శాఖ అధికారులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

చందంపేటకు.. డిండి జలాలు



డిండి ప్రాజెక్టు నుంచి నీరు పారే కాల్వ



సర్వే చేపడుతున్న అధికారులు (ఫైల్)

- రూ.400 కోట్లతో మైనర్, సబ్ మైనర్ కాల్వల నిర్మాణానికి సిద్ధమైన ప్రతిపాదనలు
- ఇప్పటికే పూర్తయిన సర్వే
- 18వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ప్రణాళిక

చందంపేట : వర్షాలపైనే ఆధారపడి పంటలు సాగు చేసే ఉమ్మడి చందంపేట మండలానికి కాల్వ ద్వారా సాగునీరు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. డిండి నుంచి కాల్వ ద్వారా సుమారు 18వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సర్వే పనులు పూర్తి చేసింది. సుమారు రూ.400 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు చేపడితే ఈ ప్రాంతం సస్యశామలం కానుంది.

రూ.1.30 కోట్లతో సర్వే..

ఉమ్మడి చందంపేట మండలంలోని భూములకు డిండి ప్రాజెక్టు నుంచి నీరు అందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నారాయణరెడ్డి (ఎన్‌ఆర్)సంస్థ ద్వారా రూ.1.30 కోట్లతో సర్వే చేపట్టింది. డిండి మండలంలోని ఎర్రారం నుంచి 17.5కిలోమీటర్ల దూరం ఉన్న ఉమ్మడి చందంపేట మండలానికి కాల్వ ఉంది. దాని ద్వారా మండలంలోని భూములకు నీరు అందించేందుకు నిర్మించాల్సి ఉన్న మైనర్, సబ్ మైనర్ కాల్వలను సర్వే చేసింది. కెనాల్ నుంచి సుమారు 80 కిలోమీటర్ల మేర మైనర్, సబ్‌మైనర్ కాలువలు నిర్మాణం చేపట్టాలని పేర్కొంది. ఈ సర్వే గ్రాఫ్ వివరాలను పొందుపర్చడానికి మూడు నెలల సమయం పడుతుందని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే పనులు చేపట్టిన అధికారులు సర్వే డిజైన్ రూపకల్పనలో నిమగ్నమయ్యారు. సర్వే పనులు పూర్తయిన తర్వాత కాలువల నిర్మాణానికి సుమారు రూ.400 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు. ప్రభుత్వం నుంచి సానుకూలత వ్యక్తమైన నిధులు విడుదల చేస్తే చందంపేట మండల రైతాంగానికి మంచి రోజులు వస్తాయి.

సాగు విస్తీర్ణం పెరుగుతుంది



చందంపేట, నేరెడుగొమ్ము మండలంలోని చాలా మంది రైతులు బోర్లపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఇక్కడి రైతుల పొలాలకు నీరు అందించడానికి సర్వే చేశారని తెలిసింది. ప్రభుత్వం కూడా నిధులు మంజూరుచేసి కాల్వలు నిర్మిస్తే ఈ ప్రాంతంలో సాగు విస్తీర్ణం పెరుగుతుంది. ఇన్నాళ్లు బోరు నీళ్ల, వర్షాలపైనే ఆధారపడి సాగు చేసినం. ఈ కాల్వలు నిర్మాణం చేపడితే.. ఇక్కడి రైతులకు ధోకా ఉండదు.

– జెల్లెల వెంకటయ్య, రైతు, చందంపేట



క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

ఆలేరురూరల్: ఆర్థిక ఇబ్బందులతో రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలేరు పట్టణ కేంద్రంలో శనివారం జరిగింది. భువనగిరి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని కురుమవాడకు చెందిన రాకేష్(25) పాన్ షాపు నడుపుకుంటూ తల్లిదండ్రులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. రాకేష్ శనివారం బైక్‌పై ఆలేరు పట్టణ కేంద్రానికి వచ్చి పెంబర్తిలో దారిలో రైలు పట్టాలపై పడుకున్నాడు. సికింద్రాబాద్ నుంచి వస్తున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాకేష్ నూతనంగా ఇల్లు నిర్మాణం చేపట్టాడని, దీంతో అప్పులు ఎక్కువై ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

భువనగిరి టౌన్: భువనగిరి పట్టణ శివారులోని హుస్సేనాబాద్‌లో గల మార్కండేయస్వామి ఆలయంలో హుండీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పట్టణ ఎస్‌ఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి మార్కండేయస్వామి ఆలయంలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి హుండీని ధ్వంసం చేసి భక్తులు సమర్పించిన కానుకలను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం పూజారి ఆలయానికి వెళ్లగా.. ఆలయ దర్వాజా పగలగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా హుండీ ధ్వంసమై ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బింగి భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ హోంగార్డు మృతి

చివ్వెంల(సూర్యాపేట): ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హోంగార్డు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. చివ్వెంల మండలం కోమటికుంట గ్రామానికి చెందిన పిట్టల యుగంధర్ (37) హైదరాబాద్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. గతేడాది దసరా పండుగకు బైక్‌పై స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో పని నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా కుడకుడ గ్రామంలో దంతాలపల్లి–సూర్యాపేట రహదారిపై బైక్‌ను కారు ఢీకొట్టింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్ తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కోదాడలో పశు ఔషధ బ్యాంకు

- రాష్ట్రంలో మొదటిసారిగా ఏర్పాటు
- పాడి పశువులకు ఉచితంగా, తక్కువ ధరకే మందుల పంపిణీ
- డాక్టర్ పెంటయ్య చొరవతో ముందుకొస్తున్న దాతలు
- ఇప్పటి వరకు 600 మంది రైతులకు పశువుల మందులు పంపిణీ



పశు ఔషధ బ్యాంకును ప్రారంభిస్తున్న జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు (ఫైల్)



కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల

కోదాడ రూరల్ : సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో పశు ఔషధ బ్యాంకు ఏర్పాటైంది. ఇక్కడ పని చేస్తున్న పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య రైతులకు మేలు చేయాలనే వినూత్న ఆలోచనతో దాతల సహకారంతో పశు ఔషధ బ్యాంకు ఏర్పాటుకు నాంది పలికారు. గేదెలు, జీవాలను ఆరుబయట మేతను మేపేందుకు గతంలో మాదిరిగా బీడు భూములు, ఖాళీ స్థలాలు లేకపోవడంతో వాటికి కావాలిసిన పోషకాలతో కూడిన మేత దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో గేదెలు, జీవాలు ఈనిన తర్వాత ఎదకు రావాల్సిన సమయానికి రావడం లేదు. గేదె నెల రోజులు ఆలస్యంగా కడితే రైతు దాదాపుగా రూ.10వేలను నష్టపోతున్నాడు. రైతులు ఆ విధంగా నష్టపోవద్దని గేదెలు సకాలంలో సూడికట్టాలంటే వాటికి మినరల్ మిక్చర్, కాల్షియం వంటి మందులు ఇవ్వాల్సి ఉంటుంది. పేద రైతులకు వాటిని కొనుగోలు చేసేంత స్థోమత ఉంటలేదు. దీంతో డాక్టర్ పెంటయ్య పశు ఔషధ బ్యాంకు ఏర్పాటు చేశారు. ఆ ఔషధ బ్యాంకు ద్వారా పాడి రైతులకు పలు రకాల న్యూట్రిషిన్ మందులతో పాటు వ్యాధుల నివారణ మందులను కూడా ఇస్తున్నారు. ఇందులో కొన్ని మందులు ఉచితంగా, మరికొన్ని అతి తక్కువ ధరలకే అందజేస్తున్నారు.

పాడి రైతులకు మేలు చేసేందుకు పశు ఔషధ బ్యాంకు



పాడిపశువుల, జీవాల పెంపకందారులకు అతి తక్కువ ధరలకే మందులను అందజేసేందుకు దాతల సహకారంతో గత ఏడాది అక్టోబర్‌లో పశుఔషధ బ్యాంకు ఏర్పాటు చేశాం. గేదెలకు ఎంతో ఉపయోగపడే మినరల్ మిక్చర్‌ను తక్కువ ధరకే అందజేస్తున్నాం. న్యూట్రిషన్ మందులతో పాటు రోగనిరోధక మందులను కూడా ఉచితంగా అందజేస్తున్నాం. ఇప్పటి వరకు 600 మంది రైతులకు పలు రకాల మందులను అందజేశాం.

– డాక్టర్ పెంటయ్య, అసిస్టెంట్ డైరెక్టర్, కోదాడ ప్రాంతీయ పశువైద్యాశాల వైద్యాధికారి


దాతల సహకారంతో...

పాడి రైతులకు ఎక్కువగా ఉపయోగపడే మినరల్ మిక్చర్(ఖనిజ లవణ మిశ్రమం), కాల్షియం టానిక్‌లు అందజేసేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారు. అమెరికాలో పశువైద్యాధికారిగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి రూ.50వేలు విరాళం ఇవ్వగా ఆ నగదు రివాల్వింగ్ ఫండ్ కింద జమ చేశారు. దానితో పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్శిటీ నుంచి 2 టన్నుల మినరల్ మిక్చర్‌ను కొనుగోలు చేశారు. బయట మార్కెట్‌లో కెజీ రూ.250 అమ్ముతుండగా వైద్యశాలకు గేదెలను తీసుకొచ్చిన పాడి రైతులకు కెజీని కేవలం రూ.50కే విక్రయిస్తున్నారు.

❖ ఇక కోదాడ మండలంలోని కాపుగల్లుకు చెందిన మరో దాత ముత్తవరపు పూర్ణచందర్‌రావు 500లీటర్ల కాల్షియం టానిక్‌ను విరాళంగా ఇవ్వగా లీటరు రూ.1000 ఉండే టానిక్‌ను ఉచితంగా ఇస్తున్నారు. అదే విధంగా లీటరు రూ.1000 ఉండే లివర్ టానిక్ కూడా రైతులకు ఉచితంగా ఇస్తున్నామని డాక్టర్ పెంటయ్య తెలిపారు. వీటితో మరికొందరు దాతలు రూ.5 వేల నుంచి రూ.20వేలకు వరకు నగదు రూపంలో విరాళం ఇచ్చారు. వాటితో గేదెలు, జీవాలు, కోళ్లకు కావాల్సిన పలు రకాల నట్టలమందు, ఐరన్‌టానిక్, పేల మందు, టానిక్ పౌడర్, యాంటి బయాటిక్, జీర్ణ సంబంధిత వంటి వ్యాధులకు సంబంధించిన మందులను స్టాక్ ఉన్నంత మేరకు ఉచితంగా అందజేస్తున్నారు. దాతలు మరింత మంది ముందుకొస్తే వారు అందజేసే నగదును రివాల్వింగ్ ఫండ్ కింద ఏర్పాటు చేసి మరింత మంది రైతులకు ఉచితంగా అందజేయడానికి వీలుంటుందని డాక్టర్ పెంటయ్య అంటున్నారు.

ప్రయాణికుడిపై ఆర్టీసీ డ్రైవర్ దురుసు ప్రవర్తన

- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- విచారణకు ఆదేశం



ఎక్స్‌లో స్పందించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు

రామగిరి(నల్లగొండ): ప్రయాణికుడి పట్ల దురుసుగా ప్రవర్తించిన ఆర్టీసీ డ్రైవర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. ఆర్టీసీ బస్ భవన్ అధికారులు విచారణకు ఆదేశించారు. వివరాలు.. నల్లగొండలో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మాచన రఘునందన్ శనివారం హైదరాబాద్ నుంచి నల్లగొండకు వచ్చేందుకు గాను ఎల్బీనగర్‌లో నాన్‌స్టాప్ బస్సు(టీఎస్ 07 జెడ్ 4038) ఎక్కారు. ఆ బస్సును హయత్‌నగర్‌లో డ్రైవర్ ఆపాడు. అయితే బస్సు హయత్‌నగర్‌లో ఆగదు అని తనకు కంట్రోలర్ చెప్పిన విషయాన్ని బస్సు డ్రైవర్‌కు రఘునందన్ గుర్తుచేశారు. దీంతో డ్రైవర్ తనతో దురుసుగా, అమర్యాదగా మాట్లాడాడని మాచన రఘునందన్ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఆయన నల్లగొండ ఆర్టీసీ ఆర్‌ఎంకు, డీఎంకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనికి ఆర్టీసీ బస్ భవన్ అధికారులు ఎక్స్(ట్విట్టర్) ద్వారా స్పందిస్తూ ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నల్లగొండ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. శనివారం వినియోగదారుల హక్కుల దినోత్సవం రోజే ఈ ఘటన జరగడం గమనార్హం.

గంజాయి తరలిస్తున్న ఐదుగురి రిమాండ్

- 22 కిలోల గంజాయి, రెండు కార్లు, 5 సెల్‌ఫోన్‌లు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

చౌటుప్పల్ రూరల్: గంజాయి తరలిస్తున్న ఐదుగురిని చౌటుప్పల్ పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని బాలాపూర్‌లోని ఎర్రకుంటకు చెందిన ఎండీ ఇమ్రానుద్దీన్, సంతోష్‌నగర్‌లోని హమీద్‌నగర్‌కు చెందిన అబ్దుల్ ఆసిఫ్, సంతోష్‌నగర్‌లోని కలేందర్‌నగర్‌కు మోసిన్‌ఖాన్, చాంద్రాయణగుట్టలోని ఆసిఙ్‌బాబానగర్‌కు చెందిన ఎండీ అమీర్, సంతోష్‌నగర్‌లోని భువన్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో గంజాయి వ్యాపారం చేస్తున్నారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు రెండు కార్లలో గంజాయి తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు పంతంగి టోల్‌ప్లాజా వద్ద వారి కార్లను ఆపి తనిఖీ చేయగా రూ.7లక్షల విలువైన గంజాయి దొరికింది. అమీర్‌పై పాత బస్తీలోని పలు పోలీస్ స్టేషనల్లో గంజాయి కేసులు ఉన్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వీరి నుంచి 22 కేజీల గంజాయి, 5 సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ కె. యాదగిరి, పోలీస్ సిబ్బందిని ఏసీపీ మధుసూదన్ రెడ్డి అభినందించారు.

సన్న బియ్యం పేరుతో మోసం

- ఇద్దరిని పట్టుకున్న డొంకతండా వాసులు



డొంకతండా వాసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

త్రిపురారం: రేషన్ బియ్యాన్ని సన్న బియ్యంగా చెప్పి ఎక్కువ ధరకు విక్రయిస్తున్న ఇద్దరిని త్రిపురారం మండలం డొంకతండావాసులు శనివారం పట్టుకున్నారు. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన దుర్గారావు, కాశిదాసు గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఆ బియ్యాన్ని కొత్త బస్తాల్లో నింపి సన్న బియ్యం పేరుతో తక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. శనివారం వారిద్దరు స్కూటీపై త్రిపురారం మండలం డొంకతండాకు వచ్చి సన్న బియ్యం అంటూ రేషన్ బియ్యం అమ్ముతుండగా.. తండాకు చెందిన ధనావత్ దర్జీ అర క్వింటా బియ్యం రూ.2వేలకు కొనుగోలు చేసింది. విషయం తెలుసుకున్న మరికొందరు తండావాసులు దర్జీ ఇంటి వద్దకు వచ్చి బియ్యం కొనేందుకు బేరం ఆడుతూ.. బస్తాల్లో బియ్యాన్ని పరిశీలించగా అవి రేషన్ బియ్యంగా గుర్తించారు. దీంతో దుర్గారావు, కాశిదాసును నిలదీయగా వారు పారిపోయేందుకు యత్నించారు. వారిని తండావాసులు వెంబడించి దామరచర్ల మండలం మోదుగులతండా వద్ద పట్టుకొని డొంకతండాకు తీసుకొచ్చారు. గతంలోనూ వారు ఇదే తరహాలో బియ్యం అమ్మి మోసం చేసినట్లు తేలింది. నిందితుల నుంచి బియ్యం, స్కూటీని తండావాసులు స్వాధీనం చేసుకున్నారు.

● వేసవిలో మంచు దుప్పటి



హుజూర్‌నగర్‌రూరల్: హుజూర్‌నగర్ శివారులో శనివారం ఉదయం వేళ వరి పొలాలను కమ్మేసిన పొగ మంచు



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేటలో కమ్ముకున్న మంచు - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని వ్యక్తి మృతి



బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ అద్దె బస్సు

ఆత్మకూరు(ఎం): ఆర్టీసీ అద్దె బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో శనివారం జరిగింది. తిమ్మాపురం గ్రామానికి చెందిన శ్యామల రమేష్(34) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తాడు. అతడి భార్య కూలి పనులు చేస్తూ భర్తకు చేదోడువాదోడుగా ఉంటోంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. శనివారం రమేష్ బైక్‌పై ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి వస్తున్నాడు. ఈ క్రమంలో తిమ్మాపురం ఎక్స్ రోడ్డు వద్ద రాయిగిరి–మోత్కూరు రోడ్డు వైపు మళ్లుతుండగా.. హైదరాబాద్–2 డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు మరిపెడ బంగ్లాకు వెళ్తూ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమేష్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్. కృష్ణయ్య తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

కేతేపల్లి: మినీ వాహనంలో అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం కేతేపల్లి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన వికాస్‌కుమార్, మిథిలేష్ రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మినీ వాహనంలో హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలో కేతేపల్లి మండలం ఇనుపాముల జంక్షన్ వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు వీరి వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో తరలిస్తున్న బియ్యం రేషన్ బియ్యం అని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

టాటా ఏస్ వాహనం దగ్ధం

కట్టంగూర్: ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా టాటా ఏస్ వాహనం దగ్ధమైంది. ఈ ఘటన కట్టంగూర్ మండలం కల్మెర గ్రామ పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం శివారులో శనివారం జరిగింది. కట్టంగూర్ మండలం కురుమర్తి గ్రామంలో గేదెను తీసుకొచ్చేందుకు కట్టంగూర్ నుంచి టాటా ఏస్ వాహనంలో ఏనుగు కృష్ణ తన స్నేహితుడితో కలిసి బయల్దేరారు. మార్గమధ్యలో కల్మెర గ్రామ పంచాయతీ పరిధిలోని సత్యనారాయపురం శివారులోకి వెళ్లగానే ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి టాటా ఏస్ వాహనంలో మంటలు లేచాయి. మంటలు గమనించిన కృష్ణ వెంటనే వాహనాన్ని నిలిపివేయగా.. అతడితో పాటు అతడి స్నేహితుడు వాహనం నుంచి కిందకు దిగారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే వాహనం మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.8లక్షలు నష్టం వాటిల్లినట్లు వాహన యజమాని కృష్ణ తెలిపాడు.



కాలిపోయిన టాటా ఏస్ వాహనం

ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

భువనగిరి: సూర్యాపేట ఎమ్మెల్యే జి. జగదీష్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం భువనగిరి పట్టణంలోని రైతు బజార్ ఎదురుగా ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసి నల్లబ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడారు. జగదీష్‌రెడ్డిపై ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. వెంటనే ఎమ్మెల్యేపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా కన్వీనర్ కొల్పుల అమరేందర్, పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బీరు మల్లయ్య, లక్ష్మీనారాయణ, రాజేందర్‌రెడ్డి, ర్యాకల శ్రీనివాస్, మల్లికార్జున్, ఇట్టబోయిన గోపాల్, తుమ్మల పాండు, సుభాష్, శంకర్, చిరంజీవి, సురేష్, జంగయ్య, ఇస్మాయిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యేళ్ల నాటి శిల్పాలను పరిరక్షించాలి

చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయంలో వెయ్యేళ్ల నాటి పురాతన శిల్పాలు ఉన్నాయని, వాటిని పరిరక్షించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. శనివారం చెన్నకేశవ ఆలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. చెన్నకేశవ ఆలయంలో క్రీ.శ.1245 కాలం నాటి కాకతీయ రాజు గణపతిదేవుడి మంత్రి మంచన విగ్రహం, అదేవిధంగా 40 అడుగుల ఎత్తు, 3 అడుగుల వెడల్పు గల నల్ల శాసనపు రాతితో చెక్కిన చెన్నకేశవుని శిల్పాలు ఉన్నాయని తెలిపారు. వీటిని భద్రపర్చి భావితరాలను తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట ఆలయ పూజారి సిరికొండ అనంతకృష్ణామాచార్యులు తదితరులు ఉన్నారు.

బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ముఠా అరెస్ట్

- 2 మోటారు సైకిళ్లు, 4 సెల్‌ఫోన్లు, రూ.24,900 నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమంద రాజు, పక్కన ఎస్‌ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్: బంగారం షాపుల యజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను శనివారం సీఐ చరమంద రాజు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నిడమనూరుకు చెందిన చింతలచెర్వు ప్రశాంత్, చింతలచెర్వు అక్షిత్‌కుమార్, నల్లగొండ పట్టణానికి చెందిన షేక్ వాజిద్, షేక్ ఇర్ఫాన్ ముఠాగా ఏర్పడ్డారు. దురలవాట్లకు బానిసై, తేలికగా డబ్బులు సంపాదించాలానే ఉద్దేశంతో గూగుల్‌లో ఎస్‌ఐల ఫొటోలు డౌన్‌లోడ్ చేసుకొని ఆ ఫొటోలను ట్రూకాలర్, వాట్సాప్‌లో డీపీలుగా పెట్టుకొని బంగారం షాపు యాజమానుల వివరాలు సేకరించారు. బంగారం షాపుల యజమానులకు ఫోన్ చేసి తాము పలానా పోలీస్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి 'మేము కొంత మంది దొంగలను పట్టుకున్నాం.. వారు దొంగిలించిన బంగారం మీ బంగారం షాపులో అమ్మారు.. ఆ బంగారం మీ నుంచి రికవరీ చేయాలి లేకపోతే కేసు పెట్టి జైలుకు పంపుతాం' అని బెదిరించేవారు. ఈ విధంగా బంగారు షాపుల యజమానుల నుండి డబ్బులు ఫోన్ పే చేయించుకుంటున్నారు. ఈ నెల 1వ తేదీన చింతలచెర్వు ప్రశాంత్ తిరుమలగిరికి చెందిన శివకుమార్ అనే జ్యువెలరీ షాపు యజమానికి ఫోన్ చేసి 'నేను రాజంపేట్ ఎస్‌ఐని మాట్లాడుతున్నా.. నువ్వు దొంగల వద్ద బంగారం కొన్నావు.. నీ పైన కేసు కాకుండా ఉండాలంటే రూ.లక్ష ఫోన్ పే చెయ్యమని చెప్పాడు'. దీంతో శివకుమార్ భయపడి రూ.52 వేలు ఫోన్ పే ద్వారా పంపాడు. అదే విధంగా ఈ నెల 8న హుజూర్‌నగర్‌లోని శ్రీనిధి జ్యువెలరీ షాపు యజమాని తుడిమల్ల నవీన్‌కుమార్‌కు ఫోన్ చేసి బెదిరించారు. దీంతో అతడు భయపడి వారు చెప్పిన ఫోన్ పే నంబర్‌కు రూ.10 వేలు పంపారు. అనంతరం నవీన్‌కుమార్‌కు అనుమానం వచ్చి హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ ముత్తయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో శనివారం ఎస్‌ఐ ముత్తయ్య తన సిబ్బందితో గోపాలపురం శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ప్రశాంత్, అక్షిత్‌కుమార్, వాజిద్, ఇర్ఫాన్ రెండు మోటార్ సైకిళ్లపై కోదాడ వైపు అనుమానాస్పదంగా వెళ్తుండగా.. పట్టుకుని విచారించగా వారు చేసిన నేరాలను అంగీకరించారు. వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 2 మోటార్ సైకిళ్లు, 4 సెల్‌ఫోన్లు, రూ.24,900 నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రకటన

విషయం : బిఎస్ఎన్ఎల్ నల్గొండ ఉద్యోగుల ఆరోగ్య సేవలకై హాస్పిటల్ ఎంప్యానల్‌మెంట్ కొరకు దరఖాస్తులను ఆహ్వానించే నోటీసు

ఈ నోటీసు ద్వారా శ్రీయుత ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ బిఎస్ఎన్ఎల్ నల్గొండ గారు, నల్గొండలో ఉన్న NABH/Non-NABH ఆసుపత్రుల నుండి ప్రస్తుతం ఉన్న CGHS రేట్ల ప్రకారము, నల్గొండ బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు న్యాయమైన ఆరోగ్య సంరక్షణ సేవలను ఇచ్చేందుకు అర్హత కలిగిన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను ఎంప్యానల్‌మెంట్ చేసుకోవడం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఆసక్తి ఉన్న NABH/Non- NABH ఆసుపత్రులు కింద ఇవ్వబడిన చిరునామా లో తేదీ 24.03.2025 లోపు సంప్రదించవలసిందిగా కోరడమైనది AGM (Admin) Room No 206 O/o PGM BA Nalgonda, BSNL Bhavan, Panagal road, Nalgonda 508001. (9440000153/9440000220)

అప్లై చేసి అర్హత కలిగినటువంటి అన్ని దరఖాస్తులు నిబంధనల మేరకు, సీజీఎం తెలంగాణ సర్కిల్ హైదరాబాద్ వారు ఆమోదించిన తర్వాత అట్టి ఆసుపత్రులతో అగ్రిమెంట్ చేసుకొనబడును.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ హైదరాబాద్ దగ్గర నార్కట్‌పల్లి వద్ద 200చ.గ.ల విల్లా ప్లాట్ 26 లక్షలే. 2BHK గెస్ట్ హౌస్ 56 లక్షలే. క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, పార్క్స్, 24/7 సెక్యూరిటీ. ORR కు 45 ని.ల ప్రయాణ దూరం మాత్రమే. లోన్ సౌకర్యం కలదు. 92481 23419 [SCA 25002063]

HOUSE FOR SALE

■ నల్లగొండలోని Mlg రోడ్ అల్కాపురి కాలనీలో తూర్పు ఫేస్ గల 196 చ॥గజములు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అమ్మకంనకు కలదు. సంప్రదించండి. సెల్ : 8523027459 [YA-15883]

■ నల్లగొండలోని Hyd రోడ్ యందు రిలయన్స్ ట్రెండ్స్ వెనుక కాకతీయ కాలేజ్ దగ్గర గ్రౌండ్ ఫ్లోర్ & ఫస్ట్‌ఫ్లోర్ 3000 Sft కలిగి 480 చ॥గజముల స్థలం గల మంచి ఎలివేషన్‌లో ఉన్న భవనం అమ్మకంనకు కలదు. సంప్ర॥ 8919187764 [YA-15837]

Services

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6239]

Wanted

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [SCA 25002107]

■ Wanted Experienced Teachers : All Subjects (B.Ed Must, English Proficiency) & Receptionist. Vishishta School, Shivaji Nagar, Nalgonda. Cell: 8885402344 [SCA25002030]

■ Wanted ITI Civil / Diploma Civil candidate to work in bank valuer Office at Bhuvanagiri. Ph 95057 99599 [SCA25002204]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు వార్డ్ బాయ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-15160]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్. జీ: 18K. Ph: 9640400073, 9160900024 [SCA25002140]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకు లను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి., నల్లగొండ
బ్రాంచి : రామగిరి నల్లగొండ, జిల్లా. నల్లగొండ

స్థిరాస్తి (వ్యవసాయ భూముల) బహిరంగ వేలము ప్రకటన

తెలంగాణ సహకార సంఘముల రూల్-52 ఇ ప్రకారము

[illegible]

క్ర. సం.	బకాయిదారుని పేరు	బకాయిదారుని తండ్రి పేరు	భూమి ఉన్న శివారు గ్రామము	వేలము తేది / సమయం	వేలము వేయు ప్రదేశము
1	బాసాని పద్మ	అంజయ్య	అమ్మనబోలు 1558అ = 0.22 1561అ = 1.03 1564అ = 0.27 1567/అ = 0.19 1567/అ2 = 0.39 1600/ఇ = 0.02 1711/అ = 0.19 మొత్తం = 4.11	18.03.2025 మ:3.00	గ్రామ పంచాయతి అమ్మనబోలు

వేలము - నియమ నిబంధనలు

[illegible]

స్థలం : నల్లగొండ, తేదీ : 12.03.2025 మేనేజర్ / 9912344258